సాక్షి
జగిత్యాల
శనివారం । 28 । జనవరి । 2023



సూర్యదేవుని శోభాయాత్ర

జగిత్యాల: పట్టణంలో శుక్రవారం సూర్యభగవానుని శోభాయాత్ర నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రావణి పాల్గొన్నారు.



గ్రామాల్లో పర్యటన

రాయికల్/ఇబ్రహీంపట్నం: పంచాయతీ అవార్డుల కమిటీ శుక్రవారం జిల్లాలో పర్యటించింది. అభివృద్ధి పనులు పరిశీలించింది.

గరిష్టం/కనిష్టం
31.0/16.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. పగటిపూట వేడిగా ఉంటుంది. సాయంత్రం చలితీవ్రత పెరిగే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఆ పాల ప్యాకెట్లు ఎక్కడివి?



పాల ప్యాకెట్లు ఉన్న కాటన్లు

జగిత్యాల: జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా బాలింతలు, గర్భిణులకు అందాల్సిన పాలు ఎక్కడపడితే అక్కడ కనిపిస్తున్నాయి. కార్యకర్తల నిర్లక్ష్యమా, సిబ్బంది ఏమరుపాటో తెలియదు గానీ.. జిల్లా కేంద్రంలోని గొల్లపల్లి మార్గంలో ఆర్టీఏ అధికారులు వాహనాల తనిఖీ చేస్తుండగా ఓ ఆటోలో పాల ప్యాకెట్లు లభించాయి. ధ్రువీకరణ పత్రాలు లేకపోవడంతో సీజ్‌చేసి స్థానిక ఆర్టీసీ డిపోకు తరలించారు. అందులో ఆరుకాటన్లలో అంగన్‌వాడీ కేంద్రాలకు చేరాల్సిన పాల ప్యాకెట్లు లభించాయి. డ్రైవర్ ఆటో, పాల ప్యాకెట్లు అక్కడే వదిలేసి వెళ్లిపోయాడు. మరోవైపు.. రెండు నెలలుగా అంగన్‌వాడీ కేంద్రాలకు పాలు సరిగా సరఫరా కావడం లేదని, ఇవి ఎక్కడివని గర్భిణులు, బాలింతలు అధికారులను ప్రశ్నిస్తున్నారు.

లక్ష్యంపై అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న బాలరాజు

జగిత్యాల: ప్రతీవిద్యార్థి తన అభివృద్ధి సామర్థ్యాల మేరకు భవిష్యత్ లక్ష్యాలపై అవగాహన పెంచుకోవాలని మద్రాస్ ఐఐటీ పూర్వ విద్యార్థి సంఘం ప్రతినిధి బాలరాజు అన్నారు. శుక్రవారం కండ్లపల్లి మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు 'మై చాయిస్, మై ఫ్యూచర్' అంశంపై ఆయన మాట్లాడారు. సైకోమెట్రీ పరీక్ష రాస్తే.. దాని ఫలితాల ఆధారంగా విద్యార్థుల అభిరుచులు, సామర్థ్యాలు సరిగా గుర్తించే వీలుంటుందన్నారు. ఈక్రమంలో తమకు అనువైన కోర్సు ఎంపిక చేసుకుని భవిష్యత్‌లో స్థిరపడవచ్చని సూచించారు. సైన్స్‌కు ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రవీందర్, మై చాయిస్, మై ఫ్యూచర్ కో ఆర్డినేటర్ జగన్‌మోహన్ పాల్గొన్నారు.

జనారణ్యంలోకి వన్యప్రాణి



మనుబోతు పిల్లను అప్పగిస్తున్న గ్రామస్తుడు

మల్లాపూర్(కోరుట్ల): జనారణ్యంలోకి వచ్చిన మనుబోతుపిల్లను గ్రామస్తులు పట్టుకుని అటవీ శాఖ అధికారులకు అప్పగించారు. గురువారం రాత్రి వెంకట్రావ్‌పేటలోని నివాసాల్లో మనుబోతు ప్రత్యక్షమైంది. తాగునీటికోసం గ్రామంలోకి వచ్చి ఉంటుందని గ్రామస్తులు తెలిపారు. దీనిని గ్రామస్తుడు గుగ్లావత్ రాజన్న చేరదీసి అటవీ అధికారులకు సమాచారం ఇచ్చారు. ఫారెస్ట్ బీట్ అధికారి మహమ్మద్ వాసీంకు దానిని అప్పగించాడు.

వాహనాలు తీసుకెళ్లండి

జగిత్యాలక్రైం: జిల్లాలోని వివిధ పోలీస్‌స్టేషన్లలో అన్‌క్లెయిమ్డ్ కింద కేసులు నమోదైన వాహనాలను సంబంధిత యజమానులు సరైన ధ్రువీకరణ పత్రాలు చూపించి తీసుకెళ్లాలని ఎస్పీ సింధూశర్మ శుక్రవారం సూచించారు. జిల్లా వ్యాప్తంగా ఇలాంటి వాహనాలు 71 గుర్తించామన్నారు. వాహనాల వివరాలను జిల్లా అధికారిక ఫేస్‌బుక్, ట్విట్టర్‌లో పొందుపరిచామని తెలిపారు. వాహనదారులు ఆర్నెల్ల కాల వ్యవధిలో వాహనాలు తీసుకెళ్లకుంటే బహిరంగ వేలం వేస్తామని ఎస్పీ వివరించారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

జగిత్యాల: జిల్లా గౌడ సంఘం అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (గోప) నూతన సంవత్సరం 2023 క్యాలెండర్‌ను జిల్లా కేంద్రంలో శుక్రవారం ఆవిష్కరించారు. జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రశేఖర్‌గౌడ్ క్యాలెండర్ ఆవిష్కరించి మాట్లాడారు. గౌడ సంఘం అభివృద్ధి, సంక్షేమానికి తమవంతు కృషి చేస్తామని వారు పేర్కొన్నారు. ప్రభుత్వం వారి సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించిందని చెప్పారు. అసోసియేషన్ అధ్యక్షుడు రవీందర్ గౌడ్, ఉపాధ్యక్షుడు సత్తయ్య, శ్రీనివాస్‌గౌడ్, నాయకులు మల్లేశం, శ్రీనివాస్, రాజయ్య, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రాజీనా.. రాజీనామానా?

- జోరుగా మంతనాలు
- ఎటూ తేలని శ్రావణి రాజీనామా వ్యవహారం
- ఆగమేఘాలపై జిల్లాకు మంత్రి కొప్పుల ఈశ్వర్
- ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, పార్టీ అధ్యక్షుడితో సమావేశం
- అసంతృప్తి కౌన్సిలర్లను బుజ్జగించాలని సూచన
- ససేమిరా అన్న బల్దియా సభ్యులు!



ఎమ్మెల్సీ రమణతో మాట్లాడుతున్న మున్సిపల్ కౌన్సిలర్లు

జగిత్యాల: మున్సిపల్ చైర్‌పర్సన్ భోగ శ్రావణి రాజీనామా వ్యవహారం ఇంకా ఎటూ తేలలేదు. బల్దియా అభివృద్ధిపై నిర్లక్ష్యం చేస్తున్నారని, నిబంధనల ప్రకారం ఆమెపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాలని కోరుతూ బీఆర్‌ఎస్‌కు చెందిన 27మంది కౌన్సిలర్లు ఇటీవల జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌కు లేఖ రాయడం, తదనంతర పరిణామాల నేపథ్యంలో సంజయ్‌పై తీవ్రమైన ఆరోపణలు గుప్పిస్తూ రెండ్రోజుల క్రితం శ్రావణి తన పదవికి రాజీనామా చేసిన విషయం విదితమే. పరిస్థితి చేయిదాటిపోతోందని భావించిన పార్టీ అధిష్టానం.. సమస్య పరిష్కరించాలంటూ జిల్లా మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను దూతగా పంపించింది. ఆయన గురువారం రాత్రి హైదరాబాద్ నుంచి జగిత్యాలకు చేరుకున్నారు. ఎమ్మెల్యే నివాసంలో బీఆర్‌ఎస్ అధ్యక్షుడు విద్యాసాగర్‌రావు, ఎమ్మెల్సీ రమణ, ఎమ్మెల్యే సంజయ్‌తో సమావేశమయ్యారు. చైర్‌పర్సన్లపై అవిశ్వాస తీర్మానం ప్రవేశ పెట్టే యోచనకు అధిష్టానం సానుకూలంగా లేదనే విషయాన్ని అసంతృప్తి కౌన్సిలర్ల దృష్టికి తీసుకెళ్లాలని, ఈ విషయంపై వారిని బుజ్జగించే ప్రయత్నాలు చేయాలని సూచించారని తెలిసింది. కానీ, ఎమ్మెల్యేపై భోగ శ్రావణి తీవ్రమైన ఆరోపణలు చేశారని, ఆమెపై తగిన చర్యలు తీసుకోవాలని కౌన్సిలర్లు పట్టుబడుతున్నారని ఎమ్మెల్సీ రమణ.. మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది. అలాకాని పక్షంలో తాము మూకుమ్మడిగా రాజీనామాలు చేస్తామని తనతో అన్నారని కొప్పులతో పేర్కొన్నారని సమాచారం. రాత్రి ఒంటిగంట వరకు సమావేశం జరిగిందని, చైర్‌పర్సన్ తీరు, కౌన్సిలర్ల అసంతృప్తికి కారణం, రాజీనామా సందర్భంగా ఎమ్మెల్యేపై శ్రావణి చేసిన ఆరోపణలు.. గత రెండురోజులుగా చోటుచేసుకుంటున్న పరిణామాలన్నింటినీ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, పార్టీ అధ్యక్షుడు కలిసి మంత్రి దృష్టికి తీసుకెళ్లారని సమాచారం. ఏదిఏమైనా అందరినీ సమన్వయం చేసుకుంటూ, పార్టీకి అప్రదిష్ట రాకుండా చూసుకోవాలని మంత్రి వారికి సూచించినట్లు తెలిసింది.

మింగుడుపడని కౌన్సిలర్లు..

అవిశ్వాస తీర్మానానికి ముందే భోగ శ్రావణి తన పదవికి రాజీనామా చేయడం, ఎమ్మెల్యేపై తీవ్రమైన ఆరోపణలు చేయడాన్ని అసంతృప్తి కౌన్సిలర్లు జీర్ణించుకోలేకపోతున్నారని తెలిసింది. ఆమె రాజీనామా పార్టీలో గందరగోళం సృష్టిస్తోందని, సంజయ్‌పై ఆరోపణలు తీవ్రమైనవని కౌన్సిలర్లు ఆగ్రహంతో ఉన్నారని సమాచారం. అందుకే శ్రావణిపై పార్టీ క్రమ శిక్షణ చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో తామే రాజీనామా చేస్తామని కౌన్సిలర్లు చెబుతున్నారని సమాచారం. మరోవైపు.. శ్రావణి రాజీనామా చేయకుంటే కౌన్సిలర్లను బుజ్జగించే ప్రయత్నం చేసేవాళ్లమని మరికొందరు నాయకులు అన్నారని సమాచారం.

రమణను కలిసిన కౌన్సిలర్లు

బీఆర్‌ఎస్ అధిష్టానం నుంచి చైర్‌పర్సన్‌పై ఎలాంటి చర్యలు తీసుకోవాలనే విషయంలపై శుక్రవారం వరకూ ఎలాంటి సమాచారం అందలేదు. దీంతో అసంతృప్తి కౌన్సిలర్లు శుక్రవారం ఎమ్మెల్సీ రమణను కలిశారు. ఆమెపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారని తెలిసింది. కాగా, చైర్‌పర్సన్ రాజీనామా లేఖ కలెక్టర్‌కు చేరినా.. దానిపై తదుపరి చర్యలేవీ తీసుకోలేదని తెలిసింది.

మరో రెండ్రోజుల్లో నిర్ణయం

మరోవైపు.. చాలాచోట్ల అవిశ్వాస తీర్మానాల చర్చ సాగుతోందని, జిల్లాలోని ధర్మపురి, మెట్‌పల్లిలోనూ ఇదే పరిస్థితి కనిపిస్తోందని పలువురు నాయకులు మంత్రి కొప్పుల దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. అందుకే.. శ్రావణి రాజీనామా నిర్ణయంపై జిల్లా నాయకులు ఆచితూచి వ్యవహరిస్తున్నారని తెలిసింది. ప్రస్తుతం జగిత్యాల సమస్యపై ఏ నిర్ణయం తీసుకోవాలన్నా.. అది మంత్రి కొప్పుల చేతుల్లోనే ఉంటుందని అంటున్నారు. జగిత్యాలోని పరిణామాలన్నింటినీ మంత్రి అధిష్టానం దృష్టికి తీసుకెళ్లి మరో రెండ్రోజుల్లో తుది నిర్ణయం తీసుకుంటారని సమాచారం.

దివ్యాంగుల సంక్షేమానికి కృషి



ఉపకరణాలు పంపిణీ చేస్తున్న మంత్రి కొప్పుల

ధర్మపురి: దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం దివ్యాంగులు, పలువురు లబ్ధిదారులకు ఉపయుక్త ఉపకరణాలు, చెక్కులు పంపిణీ చేశారు. మంత్రి మాట్లాడుతూ, దివ్యాంగులు ఆత్మస్థైర్యం కోల్పోవద్దన్నారు. వారికి ప్రభుత్వం అన్నివిధాలుగా అండగా ఉంటుందని తెలిపారు. ప్రతిభ ఉన్నవారు వివిధ రంగాల్లో రాణిస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఉపకరణాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివిధ వ్యాధులతో బాధపడుతూ ఆస్పత్రుల్లో చికిత్స పొందేవారికి సర్కారు అండగా నిలుస్తుందని తెలిపారు. ఇందుకోసం ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా పెద్దఎత్తున ఆర్థిక సాయం చేస్తోందని తెలిపారు. అనంతరం 43 మంది దివ్యాంగులకు రూ.19లక్షల విలువైన ఉపయుక్త ఉపకరణాలు పంపిణీ చేశారు. రూ.50వేల విలువైన యూనిట్లు పది మందికి, రూ.లక్ష విలువైన యూనిట్లు పదిమందికి, రూ.2 లక్షల విలువైన యూనిట్లు నలుగురికి ఆయన అందజేశారు. వివిధ వ్యాధులు, ఇతర కారణాలతో ఆస్పత్రుల్లో వైద్య చికిత్స పొందిన 63 మందికి రూ.20.05 లక్షల విలువైన చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం పట్టణంలో చేపట్టిన అభివృద్ధి పనులను మంత్రి పరిశీలించారు. ఆయన పరిశీలించిన వాటిలో సమీకృత మార్కెట్, గోదావరి తీరంలో చేపట్టిన శ్మశాన వాటిక ఉన్నాయి. ఈకార్యక్రమంలో డీసీఎమ్మెస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్తమ్మ, వైస్ చైర్మన్ రామన్న, ఎంపీపీ చిట్టిబాబు, జెడ్పీటీసీ బత్తిని అరుణ, ఏఎంసీ చైర్మన్ అయ్యోరి రాజేశ్, జిల్లా సంక్షేమ అధికారి నరేశ్, మున్సిపల్ కమిషనర్ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలకు తిలోదకాలు



- జిల్లాలోని ఓ మున్సిపాలిటీలో నిర్మాణంలో ఉన్న సీసీ రోడ్డు ఇది. సిమెంట్ పని పూర్తయ్యాక క్యూరింగ్ కోసం మట్టితో కట్టలు కట్టి మధ్య నీటిని నిల్వ చేశారు. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్.. నిబంధనల ప్రకారం ఇలా క్యూరింగ్ చేస్తున్నారు. దీనిద్వారా సిమెంట్ గట్టిపడి రోడ్డు చాలాకాలం పాటు మన్నికగా ఉంటుందని ఇంజినీరింగ్ అధికారులు చెబుతున్నారు.

- సీసీ రోడ్లకు క్యూరింగ్ అంతంతే
- ఓవైపు పనులు.. మరోవైపు రాకపోకలు
- ధ్వంసమవుతున్న రహదారులు
- దుర్వినియోగమవుతున్న ప్రజాధనం



- అక్కడక్కడా చిన్న గుంతలు కనిపిస్తున్న ఈ సీసీ రోడ్డు మెట్‌పల్లి బల్దియా నాలుగో వార్డులోనిది. ఇటీవలే నిర్మించారు. ఓవైపు పనులు నడుస్తుండగానే.. మరోవైపు రాకపోకలు సాగుతున్నాయి. దీంతో రోడ్డుపై గుంతలు ఏర్పడ్డాయి. వాస్తవానికి సీసీ పనులు పూర్తయిన వెంటనే క్యూరింగ్ చేయాలి. ఇందుకోసం మట్టితో కట్టలు కట్టి కనీసం పదిరోజుల పాటు నీటిని నిల్వచేయాలి. కాంట్రాక్టర్లు పట్టించుకోవడంలేదు. పనులు పూర్తయిన రెండు, మూడ్రోజులకే రోడ్డు ఇలా దెబ్బతింటోంది.

మెట్‌పల్లి(కోరుట్ల): జిల్లాలోని వివిధ మున్సిపాలిటీల్లో రహదారుల అభివృద్ధి ప్రభుత్వం ఏటా రూ.కోట్లు కేటాయిస్తోంది. ఈ పనులు దక్కించుకుంటున్న కొందరు కాంట్రాక్టర్లు.. ఇంజినీరింగ్ అధికారుల సూచించిన నిబంధనలు పాటించడంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. ప్రభుత్వం ఇందుకోసం విధి విధానాలు రూపొందించినా.. టెండర్ల ద్వారా పనులు దక్కించుకుంటున్న కాంట్రాక్టర్లు.. నిబంధనల ప్రకారం పూర్తిచేయడంలేదు. ఈ పనులు పర్యవేక్షించాల్సిన బాధ్యత ఇంజినీరింగ్ విభాగం అధికారులపై ఉంటుంది. కానీ మెట్‌పల్లి మున్సిపాలిటీలో ఆ శాఖ అధికారుల నిర్లక్ష్యంతో కొందరు కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. పనుల విషయంలో నిబంధనలకు పాతర వేస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అయినప్పటికీ అధికారులు ఏమాత్రం పట్టించుకోకుండా వారికి బిల్లులు చెల్లిస్తున్నారు.

రూ.5కోట్లతో రహదారుల పనులు..

- పట్టణంలో సుందరీకరణ, పట్టణ ప్రగతి నిధులు సుమారు రూ.5కోట్లను సీసీ రహదారుల నిర్మాణానికి కేటాయించారు.
- ఇందులో ఇప్పటికే కొన్నిపనులు పూర్తి కాగా.. మరికొన్ని ప్రారంభించాల్సి ఉంది.
- సీసీ రోడ్ల నిర్మాణం విషయంలో క్యూరింగ్ ప్రక్రియ ముఖ్యమైనది. కనీసం పదిహేను రోజులపాటు క్యూరింగ్ చేయాలి.
- సీసీ వేసిన తర్వాత దానిపై నాణ్యమైన మట్టితో కట్టలు కట్టి అందులో నీటిని నిల్వ చేయాలి. రాకపోకలు సాగకుండా చర్యలు తీసుకోవాలి.
- కానీ స్థానికంగా ఇలా చేయడం లేదు. సీసీ పూర్తయిన తర్వాత దానిపై ఎండు గడ్డి పరిచి అప్పుడప్పుడు నీటిని పడుతున్నారు. ఇది కూడా మూడు, నాలుగురోజుల పాటు మాత్రమే చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.
- అలాగే రాకపోకలను నియంత్రించకపోవడంతో రోడ్లు కొన్నిరోజులకే దెబ్బ తింటున్నాయి.

పర్యవేక్షణ అంతంతే..

రోడ్డు పనులు పూర్తయిన తర్వాత 28 రోజుల అనంతరం క్వాలిటీ కంట్రోల్ అధికారులు వాటిని పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక అందజేస్తారు. దానిని పరిగణనలోకి తీసుకుని ఇంజినీరింగ్ అధికారులు బిల్లులు చెల్లిస్తారు. మెట్‌పల్లి మున్సిపాలిటీలో ఒక డీఈ, ఒక ఏఈ, ఇద్దరు వర్క్ ఇన్‌స్పెక్టర్లు ఉన్నారు. వీరు పనులు జరిగే సమయంలో ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ నిబంధనలు పక్కగా అమలయ్యేలా చూడాలి. కానీ అధికారులతోపాటు వర్క్ ఇన్‌స్పెక్టర్ల పర్యవేక్షణ కొరవడడంతో స్థానికంగా పనులు నాణ్యతగా జరగడం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. దీనిద్వారా చేసిన పనులు కొద్దిరోజులకే అధ్వానంగా తయారవుతుండడం గమనార్హం.

బాలికల ఆత్మరక్షణకు కరాటే

- జిల్లాలో 170 పాఠశాలలు, 14 కేజీబీవీలు ఎంపిక
- శిక్షణ కోసం రూ.9.20 లక్షలు కేటాయింపు



కరాటే శిక్షణ పొందుతున్న బాలికలు

కథలాపూర్(వేములవాడ): పోకిరీల ఆగడాలు, వేధింపుల నుంచి తమను తాముగా రక్షించుకునేందుకు బాలికలకు కరాటే శిక్షణ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈమేరకు జిల్లాలో బాలికల సంఖ్య అధికంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలు, కేజీబీవీల్లో ఆత్మరక్షణకు ఉపయోగపడే కరాటే నేర్పించాలని విద్యాశాఖ ఆదేశాలిచ్చింది. ప్రతీ పాఠశాలలో నెలరోజులపాటు ప్రత్యేకంగా తర్ఫీదు ఇవ్వనున్నారు. ఇది పూర్తయితే బాలికల్లో ఆత్మస్థైర్యం నింపినట్లవుతుందని మహిళలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

184 పాఠశాలల్లో శిక్షణ.. రూ.9.20 లక్షల కేటాయింపు

- జిల్లాలో 85 ప్రాథమికోన్నత, 187 జెడ్పీ హైస్కూళ్లు, 14 కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాలు ఉన్నాయి.
- బాలికలు అధికంగా ఉన్న పాఠశాలలను కరాటే శిక్షణ కోసం ఎంపిక చేయాలని నిర్ణయించారు.
- 170 పాఠశాలలు, 14 కేజీబీవీలను ఇందుకోసం ఎంపిక చేశారు.
- బాలికలకు కరాటే, కుంగ్‌ఫూ, జూడో వంటి వాటిల్లో తర్ఫీదు ఇవ్వనున్నారు.
- మార్షల్స్ ఆర్ట్స్‌లో 30 రోజులపాటు ఇవ్వాలని ఆదేశాలిచ్చారు.
- ఇందుకోసం ఒక్కో పాఠశాలకు రూ.5 వేల చొప్పున 184 పాఠశాలలకు సుమారు రూ.9.20 లక్షలు కేటాయించారు.
- ఇందులో నుంచి ఇన్‌స్ట్రక్టర్లకు వేతనం చెల్లించాలి.
- ఎంపిక చేసిన పాఠశాలల్లో ఈనెల 24న జాతీయ బాలికా దినోత్సవం రోజున లాంఛనంగా కరాటే శిక్షణ ప్రారంభించారు.
- ఫిబ్రవరి 23వ తేదీ వరకు కరాటేలో శిక్షణ ఇవ్వనున్నారు.

మనోధైర్యం పెరుగుతుంది

పాఠశాలల్లో బాలికలకు కరాటే శిక్షణ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించడం హర్షణీయం. కరాటే నేర్చుకుంటే వారిలో మనోధైర్యం, ఆత్మవిశ్వాసం పెరుగుతాయి. బాలికలు అన్ని రంగాల్లో రాణించాలి. ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలి.

– జవ్వాజి రేవతి, ఎంపీపీ, కథలాపూర్

సద్వినియోగం చేసుకోవాలి

జిల్లాలో 184 పాఠశాలలను కరాటే శిక్షణకు ఎంపిక చేశాం. కరాటే శిక్షణను బాలికలు సద్వినియోగం చేసుకోవాలి. పాఠశాల స్థాయిలోనే నేర్చుకుంటే తమను తాము రక్షించుకుంటామనే నమ్మకం బాలికల్లో కలుగుతుంది. చదువులోనూ ఏకాగ్రత పెరుగుతుంది.

– జగన్మోహన్‌రెడ్డి, డీఈవో

వరికి మొగిపురుగు ముప్పు

- సుమారు 30వేల ఎకరాల్లో ప్రభావం
- వాతావరణ మార్పులే కారణమంటున్న శాస్త్రవేత్తలు



పెగడపల్లిలో ఎర్రబడ్డ వరి పొలం

జగిత్యాలఅగ్రికల్చర్/పెగడపల్లి(ధర్మపురి): ఈ యాసంగిలో వరిని మొగిపురుగు ఆశించింది. వాతావరణ మార్పులతోపాటు రైతుల నిర్లక్ష్యం మొగిపురుగు ఉధృతికి కారణమని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. పురుగు నివారణకు రూ.వేలు వెచ్చించి రసాయన మందు పిచికారీ చేస్తున్నారు. జిల్లాలో దాదాపు 30 వేల ఎకరాల్లో మొగిపురుగు ఆశించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో జిల్లా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతు వేదికల్లో అవగాహన సమావేశాలు ఏర్పాటు చేసి మొగిపురుగు నివారణకు తీసుకునే జాగ్రత్తలపై రైతుల్లో చైతన్యం తెస్తున్నారు. అలాగే, పొలాస వ్యవసాయ శాస్త్రవేత్తలు కూడా పంటలను సందర్శించే పనిలో ఉన్నారు.

మొగిపురుగు ఎలా ఆశిస్తుందంటే..

- మొగిపురుగునే కాండంతొలుచు పురుగు(ఊస తిరుగుడు రోగం, తెల్లకంకి రోగం) అని కూడా అంటారు.
- ఈ పురుగు నారుమడిలో ఆశిస్తే మొక్కలు, పిలకదశలో ఆశిస్తే దుబ్బులు ఎండిపోయి చనిపోతాయి.
- చిరుపొట్టదశలో ఆశిస్తే వరి ఈనిన తర్వాత తెల్లకంకులు బయటకు వస్తాయి.
- ఈ పురుగును ఏదశలో నిర్లక్ష్యం చేసినా నష్టం తీవ్రంగా ఉంటుంది.
- వానాకాలంతో పోల్చితే యాసంగిలో దీని ప్రభావం ఎక్కువగా ఉంటుంది.
- గతేడాది వానాకాలంలో భారీ వర్షాలు కురవడం, తేమతో కూడిన వాతావరణ పరిస్థితులు ఈ పురుగు ఉధృతికి కారణమని అధికారులు చెబుతున్నారు.
- ఈ పురుగులే ఈ యాసంగిలోనూ పంటకు నష్టం చేస్తున్నాయి.
- తల్లిరెక్కల పురుగు కనీసం 200–300 గుడ్లు పెడుతుంటుంది.
- వీటినుంచి వచేచ పిల్లలు తమ సంతతిని వృద్ధి చేస్తాయి.

నారుమడి నుంచే పురుగుల ఉధృతి..

వరిలో పురుగుల ఉధృతి తగ్గించేందుకు నారుమడి దశలోనే అన్ని యాజమాన్య పద్ధతులు పాటించాలని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. కానీ, కొందరు రైతులు నిర్లక్ష్యంతో సరైన చర్యలు తీసుకోవడం లేదు. దీంతో నారుమడి నుంచే పురుగుల ఉధృతి పంటను ఆశించి, తీవ్ర నష్టం చేస్తున్నాయి. దీంతోపాటు వానాకాలం, యాసంగికి మధ్య కనీసం 15 రోజులు కూడా ఎడం ఉంచడం లేదు. దీంతో వరి పైరు కోయగానే కొయ్యకాళ్లు మురగకుండానే, మళ్లీ పొలం దున్ని నారు పోస్తున్నారు. అప్పటికే కొయ్యకాళ్లలో ఉన్న పురుగు నారుకు, నారు నుంచి ప్రధాన పంటకు ఆశిస్తోంది. ఈ పురుగు మొక్క కాండంలోకి వెళ్లి గుజ్జు తింటూ మొక్కను ఎదగనివ్వడంలేదు. దీంతో మొక్క ఎండిపోతోంది.

రైతులు ఏం చేస్తున్నారంటే..

- రైతులు నారుమడిలోనే కార్బోఫ్యూరాన్ గుళికలు చల్లుకుంటే సరిపోయేది.
- కానీ, ప్రధాన పొలంలో నాటువేసి మొక్కలు చనిపోయినప్పుడే పురుగుమందుల దుకాణాల వెంట పరుగెత్తుతున్నారు.
- వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తలను సంప్రదించడం లేదు.
- దుకాణదారులు ఏ మందు ఇస్తే దానినే పంటపై చల్లుతున్నారు.
- పురుగు నియంత్రణలోకి రావడంలేదని గగ్గోలు పెడుతున్నారు.
- ఈ సమయంలోనే పురుగు ఆశించి మొవ్వ చనిపోతోంది.
- నారుమడిలో ఎలాంటి చర్యలు తీసుకోకుంటే.. కనీసం నాటు వేసిన 15 రోజుల్లోగా గుళికలు చల్లుకున్నా సరిపోతుంది.
- కానీ, ఆ సమయంలోనే స్పందించకపోవడంతో చివరకు రూ.వేలు వెచ్చించి రసాయన మందులు పిచికారీ చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.
- ఇంకా, కొన్ని గ్రామాల్లో నాటు వేసేటప్పుడు డీఏపీకి బదులు, నేలకు, మొక్కకు అవసరం లేని ఏవేవో రసాయన మందులు వేస్తున్నారు.
- దీంతో మొక్కలు అనారోగ్యానికి గురవుతున్నాయి.
- మొక్కల వేర్లు నల్లబడి చనిపోతున్నాయి.

ఆందోళన అవసరం లేదు



మారిన వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో ఈ యాసంగిలో వరికి మొగిపురుగు ఉధతి అధికంగానే ఉంది. అయినా రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. నాటు వేసిన 15 రోజుల్లోగా గుళికలు వేయాలి. అప్పటికీ కొన్ని దుబ్బులు చనిపోతే మిగిలినవాటి కోసం రసాయన మందులు చల్లుకోవాలి.

– ఓంప్రకాశ్, కీటక శాస్త్రవేత్త, పొలాస

వ్యవసాయ శాస్త్రవేత్తల సలహాలు..

వ్యవసాయ శాస్త్రవేత్తలు ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో మొగిపురుగు నివారణకు చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యల గురించి వివరించారు. వరి నాటిన 15–20 రోజులకు ఎకరాకు 8 కిలోల కార్టాప్ హైడ్రో క్లోరైడ్ లేదా 10 కిలోల కాకర్బోఫ్యూరాన్ గుళికలు లేదా 4 కిలోల 0.4 జి క్లోరాంత్రినిలిప్రొల్ గుళికలు వేసుకోవాలి. అలాగే, పంట ఎదిగి ఉన్నట్లయితే..400 గ్రాముల కార్టాప్ హైడ్రో క్లోరైడ్ 50 శాతం ఎస్పీ లేదా 60 మి.లీ. క్లోరాంత్రినిలిప్రొల్ ఎకరాకు పిచికారీ చేయాలి.

క్లుప్తంగా

నేడు ఎస్పీగా భాస్కర్ బాధ్యతలు స్వీకరణ

జగిత్యాలక్రైం: జగిత్యాల జిల్లా ఎస్పీగా ఎగ్గడి భాస్కర్ శనివారం ఉదయం బాధ్యతలు స్వీకరించనున్నారు. గతంలో పనిచేసిన ఎస్పీ సింధూశర్మ ఫోర్త్ బెటాలియన్ మామునూర్‌కు బదిలీ కాగా జగిత్యాల ఎస్పీగా భాస్కర్ నియమితులయ్యారు. దీంతో శనివారం ఉదయం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరిస్తుండగా కార్యాలయ సిబ్బంది అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు.

మున్నుకు అవార్డు



అవార్డు అందుకుంటున్న మున్ను

రాయికల్: పట్టణానికి చెందిన మున్ను ఉత్తమ సామాజిక కార్యకర్త అవార్డును శుక్రవారం విశాఖపట్నంలోని చెన్నారావు వెల్ఫేర్ సొసైటీ ట్రస్ట్ ఆధ్వర్యంలో అవార్డును వ్యవస్థాపక అధ్యక్షుడు చెన్నారావు, జోనల్ కమిషనర్ కృష్ణ, డాక్టర్ ఎం వీవీ.మురళీమోహన్ చేతులమీదుగా అందుకున్నారు.మున్నును పలువురు అభినందించారు.

ముగ్గురిపై డ్రంకెన్ డ్రైవ్ కేసు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మద్యంతాగి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని ఎల్లారెడ్డిపేట ఎస్సై వి.శేఖర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో వాహన తనిఖీలు, డ్రంకెన్ డ్రైవ్ చేపట్టారు. మద్యంతాగి వాహనాలు నడుపుతున్న ముగ్గురిపై కేసులు నమోదుచేసినట్లు ఎస్సై తెలిపారు. వాహన పత్రాలు వెంట తెచ్చుకోవాలని సూచించారు. వాహన తనిఖీల్లో ఏఎస్సై బి.కిషన్‌రావు, పోలీస్‌సిబ్బంది పాల్గొన్నారు.

ఇక హాజరుశాతం పక్కా!

- జూనియర్ కళాశాలల్లో బయోమెట్రిక్ విధానం
- ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అమలుకు సన్నాహాలు
- పారదర్శకత కోసమే ప్రభుత్వ నిర్ణయం
- మొదటి విడతలో అధ్యాపకులు, సిబ్బందికి అమలు
- జిల్లావ్యాప్తంగా 15 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు

జిల్లాలో ఇంటర్ ప్రభుత్వ కళాశాలల వివరాలు	
ప్రభుత్వ జూనియర్ కళాశాలలు :	15
ప్రిన్సిపాల్స్ :	14 (ఒక పోస్టు ఖాళీ)
రెగ్యులర్ అధ్యాపకులు :	21
కాంట్రాక్ట్ లెక్చరర్లు :	151
పార్ట్‌టైం లెక్చరర్లు :	02
గెస్ట్ లెక్చరర్లు :	53
లైబ్రేరియన్స్ :	03
నాన్ టీచింగ్ సిబ్బంది :	63 (18 పోస్టులు ఖాళీ)
సెకండియర్ విద్యార్థులు :	3,425
ఫస్టియర్ విద్యార్థులు :	2,850



మల్లాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల

మల్లాపూర్: జూనియర్ కళాశాలల్లో బయోమెట్రిక్ విధానం అమలుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. గతంలో జూనియర్ కళాశాలలపై పర్యవేక్షణ లేక అధ్యాపకులు, విద్యార్థులు ఇష్టానుసారంగా తరగతులకు హాజరయ్యేవారు. దీంతో ఇంటర్ ఫలితాలపై తీవ్ర ప్రభావం చూపేది. ఈ క్రమంలో ఇంటర్ విద్యావ్యవస్థను గాడిలో పెట్టేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఇందుకు ప్రభుత్వ, ప్రైవేటు ఇంటర్ కళాశాలల్లో బయోమెట్రిక్ విధానాన్ని అమలుచేయాలని నిర్ణయించింది. మొదటి విడతలో ప్రభుత్వజూనియర్ కళాశాలల్లో అమలుకు ఇప్పటికే అధ్యాపకులు, సిబ్బంది వివరాలను ఉన్నతాధికారులకు పంపించింది. ప్రభుత్వపరంగా అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నా.. ఆశించిన స్థాయిలో ఫలితాలు రాకపోవడంతో ఇంటర్‌బోర్డు బయోమెట్రిక్ విధానం అమలుకు కార్యచరణ చేపట్టింది.

75 శాతం హాజరు ఉంటేనే..

గతంలో విద్యార్థులు తరగతులకు హాజరుకాకపోయినా ఉపకార వేతనాల కోసం అవసరమైన హాజరుశాతం వేసేవారు. అలాగే పరీక్షలకు అనుమతించేవారు. ప్రస్తుతం బయోమెట్రిక్ విధానం అమలుతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఖచ్చితమైన ధోరణి అవలంభిస్తారని 75శాతం హాజరు ఉంటేనే విద్యార్థులకు ఉపకార వేతనం, ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తించేలా చర్యలు చేపడుతున్నారు. ఇంటర్ నోడల్ ఆఫీసర్ కార్యాలయంలో బయోమెట్రిక్ విధానం అమలు చేస్తుండగా.. ఫిబ్రవరి 1నుంచి ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో అమలు చేసే అవకాశం ఉంది.

వివరాలు అందించాం



ఇంటర్మీడియట్ కళాశాల్లో బయోమెట్రిక్ అమలుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికైతే అధ్యాపకులకు, సిబ్బందికి బయోమెట్రిక్ విధానం అమలుచేస్తున్నాం. దీనికి సంబంధించిన వివరాలను ఉన్నతాధికారులకు పంపించాం. మరో వారంరోజుల్లో ఈ విధానం అమల్లోకి వస్తుంది. దీంతో కళాశాల్లో ఆధ్యాపకులకు జవాబుదారీతనం పెరుగుతుంది. ప్రతి ఒక్కరూ సమయపాలన పాటించాలి.

– నారాయణ, ఇంటర్ జిల్లా నోడల్ అధికారి, జగిత్యాల

పసుపు రైతుల గోడు పట్టదా?

- ఎంపీ అర్వింద్ రాజీనామా చేయాలి
- టీపీసీసీ నాయకుడు జువ్వాడి కృష్ణారావు



రైతులతో మాట్లాడుతున్న జువ్వాడి కృష్ణారావు

ఇబ్రహీంపట్నం: పసుపు రైతులను ఎంపీ అర్వింద్ పట్టించుకోవడం లేదని టీపీసీసీ నాయకుడు జువ్వాడి క్రిష్ణారావు అన్నారు. శుక్రవారం మండలంలోని కొమటికొండాపూర్‌లో పసుపు పంటలను పరిశీలించి పసుపు పంట దిగుబడి లాభాలపై రైతులను అడిగి తెలుసుకున్నారు. ఎకరంలో పసుసు సాగుకు రూ.1.20 లక్షలు పెట్టుబడి అవుతుందన్నారు. ఎకరానికి 30 క్వింటాళ్ల దిగుబడి రావల్సిఉండగా ఈ ఏడాది 12 క్వింటాళ్ల దిగుబడి వస్తుందన్నారు. ఈక్రమంలో మార్కెట్‌లో పసుపు పంటకు మద్దతు ధర లేక రైతులు ఆత్మహత్య చేసుకునే పరిస్థితి దాపురించిందన్నారు. 2019 పార్లమెంట్ ఎన్నికల్లో ఎంపీ అర్వింద్ పసుపు పంటకు మద్దతు ధర కల్పిస్తామన్న మాటలు నీటి మూటలయ్యాయన్నారు. పసుపు బోర్డు ఏర్పాటు ఊసేలేదన్నారు. ఇచ్చిన మాట నెరవేర్చని ఎంపీ అర్వింద్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్‌చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, అమృత్‌రాజ్, జెట్టి లక్ష్మణ్,శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

మానేరు వెలస్కో-23 పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న డీఈఓ తదితరులు

సప్తగిరికాలనీ(కరీంనగర్): కరీంనగర్‌లోని మానేరు విద్యాసంస్థల ఆధ్వర్యంలో పద్మనగర్‌లోని మానేరు సెంట్రల్ స్కూల్‌లో వెలస్కో- 2023 పేరిట నిర్వహించే 37వ వార్షికోత్సవానికి సంబంధించి వాల్ పోస్టర్‌ను శుక్రవారం కరీంనగర్ జిల్లా విద్యాశాఖ అధికారి సీహెచ్ జనార్దన్‌రావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత మూడేళ్లుగా విద్యార్థులు వార్షికోత్సవాలకు దూరంగా ఉన్నారని ఈ సంవత్సరం అన్ని విద్యాసంస్థలు ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మానేరు స్కూల్ విద్యార్థులు తమ మేధస్సుకు పదునుపెట్టి సమాజానికి ఉపయోగపడే వినూత్న ప్రదర్శనలు చేయడం అభినందనీయమన్నారు. విద్యాసంస్థల చైర్మన్ కడారి అనంతరెడ్డి మాట్లాడుతూ, ఈ నెల 28, 29 తేదీల్లో వార్షికోత్సవాన్ని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మేనేజింగ్ డైరెక్టర్ కడారి కృష్ణారెడ్డి మాట్లాడుతూ, ప్రస్తుత కాలంలో కరోనా లాంటి వైరస్‌లను భవిష్యత్‌లో ఎలా ఎదుర్కోవాలో తదితరవాటిని ప్రదర్శించనున్నట్లు తెలిపారు. 28న జరిగే కార్యక్రమానికి కలెక్టర్ ఆర్వీ కర్ణన్, 29న జరిగే కార్యక్రమానికి శాతవాహన యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ సీహెచ్.మల్లేశం హాజరవుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా సెక్టోరియల్ అధికారి అశోక్‌రెడ్డి, జిల్లా సైన్స్ అధికారి జైపాల్‌రెడ్డి, మానేరు బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

ఆగిన లారీని ఢీకొని వృద్ధుడు మృతి

కరీంనగర్‌రూరల్: వృద్ధుడు స్కూటీపై వెళ్తూ ఆగి ఉన్న లారీని వెనకనుంచి ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. రూరల్‌పోలీసుల కథనం ప్రకారం.. కరీంనగర్‌లోని సుభాష్‌నగర్‌కు చెందిన సుంకే భూమయ్య(70) చిన్న కుమారుడు మహేశ్ నెలరోజుల నుంచి చల్మెడ ఆనందరావు క్యాన్సర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. రోజూ భూమయ్య ఆస్పత్రికి వెళ్లి కుమారుడికి ఆహారం ఇచ్చి వస్తున్నాడు. శుక్రవారం ఉదయం 9.30 గంటలకు ఆస్పత్రి నుంచి స్కూటీపై బయల్దేరిన భూమయ్య బొమ్మకల్ ఫ్లైఓవర్ వద్ద రోడ్డులో నిలిపిన లారీని వెనుక నుంచి ఢీకొని అక్కడికక్కడే మృతిచెందాడు. భార్య భూలక్ష్మి ఫిర్యాదుతో పోలీసులు కేసుదర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ మహిళ..

పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్‌కు చెందిన పద్మ ప్రమాదవశాత్తు ద్విచక్రవాహనంపై నుంచి కిందపడి ఆస్పత్రిలో చికిత్సపొందుతూ మృతిచెందింది. రూరల్ పోలీసుల కథనం.. సుల్తానాబాద్‌కు చెందిన ఎనగంటి శంకరయ్య–పద్మ దంపతులు కరీంనగర్‌లోని కమల్ సెలక్షన్స్‌లో పనిచేస్తారు. రోజూ ఉదయం స్కూటీపై ఇద్దరు కరీంనగర్‌కు వచ్చి మళ్లీ సుల్తానాబాద్‌కు రాత్రి వెళ్తారు. ఈ క్రమంలో గురువారం కరీంనగర్‌కు వస్తున్న క్రమంలో బొమ్మకల్ ఫ్లైఓవర్ సమీపంలో ప్రమాదవశాత్తు పద్మ స్కూటీ పైనుంచి కిందపడింది. గాయపడిన పద్మను చల్మెడ ఆనందరావు ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ శుక్రవారం వేకువజామున మృతిచెందింది. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

స్కూల్ ఎదుట నిరసన

జ్యోతినగర్(రామగుండం): ఎన్టీపీసీ రామగుండం టీటీఎస్‌లోని ఓ స్కూల్ ఎదుట బాధితులు నిరసన చేపట్టారు. శుక్రవారం రాత్రి టౌన్‌షిప్‌లోని స్కూల్ ముందు గోదావరిఖని ఇందిరానగర్‌కు చెందిన పలువురు కరాటే కోచ్ మనోజ్ ఉద్యోగాలు ఇప్పిస్తామని అనడంతో పాటు స్కూల్‌లో అడ్మిషన్ల కోసం, అప్పుగా మొత్తంగా అతడికి డబ్బులు ఇచ్చామని తిరిగి ఇవ్వకుండా తప్పించుకుని తిరుగుతున్నాడని బాధితులు ఆరోపిస్తున్నారు. స్కూల్‌లో మనోజ్ ఉన్నాడనే సమాచారంతో బాధితులు పెట్రోల్ బాటిల్స్‌తో నిరసన చేపట్టారు. మనోజ్ 100 డయల్‌కు కాల్ చేయడంతో పోలీసులు అతడిని స్టేషన్‌కు తీసుకురాగా ఇరు వర్గాలు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో తిరిగి బాధితులు స్కూల్‌లో పెట్రోల్ బాటిల్స్‌ను పట్టుకుని నిరసన చేపట్టారు. ఎన్టీపీసీ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు.

కొండాపూర్ సర్పంచ్‌పై ఫిర్యాదు

కోనరావుపేట(వేములవాడ): సమాచారహక్కు చట్టంపై అడిగిన వ్యక్తిని చంపుతామని బెదిరించిన సంఘటనలో కోనరావుపేట మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు, కొండాపూర్ సర్పంచ్ మల్యాల దేవయ్యపై శుక్రవారం ఫిర్యాదు వచ్చినట్లు ఎస్సై రమాకాంత్ తెలిపారు. వివరాలు బాధితుడు నేవూరి రత్నాకర్ కథనం ప్రకారం, కొండాపూర్ పంచాయతీలో జరిగిన అవినీతిపై జిల్లా అధికారులకు ఫిర్యా దు చేశాడు. విచారణ చేపట్టిన అధికారులు సర్పంచ్, కార్యదర్శి చెక్‌పవర్‌ను ఎంపీవోకు అటాచ్ చేశారు. దీంతో సర్పంచ్ దేవయ్య కోపోద్రిక్తుడై రత్నాకర్‌ను పిలిపించి అవినీతిని నిరూపించాలని, లేకుంటే ఊరి నుంచి బహిష్కరిస్తామని హెచ్చరించారు. దేవయ్యతోపాటు అతని కుమారులు, మరి కొంతమంది చంపుతామని బెదిరిస్తున్నారని రత్నాకర్ ఫిర్యాదు చేశారు. సర్పంచ్, అతని కుమారులు, మరో 10 మందితో తనకు ప్రాణభయం ఉందన్న ఫిర్యాదుపై విచారణ చేపడుతున్నట్లు ఎస్సై తెలిపారు.

బీసీ గణన చేపట్టాలి

సిరిసిలఅర్బన్: బీసీలకులగణన చేపట్టాలని బీఎస్పీ ఆధ్వర్యంలో సిరిసిల్ల పట్టణంలోని స్థానిక అంబేద్కర్‌చౌక్‌వద్ద శుక్రవారం సంతకాల సేకరణ చేపట్టారు. ఈసందర్భంగా పార్టీ జిల్లా కోఆర్డినేటర్ మ్యాకల మునీందర్, జిల్లా అధ్యక్షుడు వర్దవెల్లి స్వామి మాట్లాడుతూ.. బీసీ వర్గాలను కేవలం ఓట్లేసే యంత్రాలుగా చూస్తున్నారన్నారు. బీసీ కుల గణన చేపట్టి రిజర్వేషన్ అమలుచేయాలన్నారు. బీసీ,ఎస్సీ,ఎస్టీ మైనార్టీలు ఏకమై బహుజన రాజ్యస్థాపనకు కృషి చేయాలన్నా రు. బీఎస్పీ జిల్లా కార్యదర్శి మధుకర్, పటేల్, అన్నల్‌దాస్ బాను, రమేశ్ ఉన్నారు.

రాహుల్‌హెగ్డేకు వీడ్కోలు



బదిలీపై వెళ్తున్న రాహుల్‌హెగ్డేకు పరేడ్‌లో గౌరవ వందనం చేస్తున్న పోలీసులు

సిరిసిల్లక్రైం: సుదీర్ఘకాలం పాటు జిల్లాలో ఎస్పీగా విధులు నిర్వహించి హైదరాబాద్‌కు బదిలీపై వెళ్తున్న రాహుల్‌హెగ్డేకు జిల్లా పోలీసులు గౌరవంగా వీడ్కోలు పలికా రు. తంగళ్లపల్లిలో పోలీసు హెడ్‌క్వార్టర్స్‌లో శుక్రవారం పరేడ్ నిర్వహించి నూతన ఎస్పీ అఖిల్‌మహాజన్ ఆధ్వర్యంలో గౌరవ వందనం నిర్వహించారు. ప్రజాశాంతి, శాంతిభద్రతల పరిరక్షణకు క్రమశిక్షణ, అంకితభావంతో పనిచేసిన అందరికీ రాహుల్‌హెగ్డే కృతజ్ఞతలు తెలిపారు బదిలీపై వెళ్తున్న రాహుల్‌హెగ్డే మాట్లాడుతూ ప్రజాశాంతి కోసం రాజీపడకుండా తనతోపాటు అంకితభావంతో పనిచేసిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఐదేళ్లు పనిచేసే అవకాశం రావడం సంతోషంగా ఉందని సమర్థంగా పనిచేసిన మధుర స్మృతులతో బదిలీపై వెళ్లడం ఆనందంగా ఉందన్నారు. ప్రభుత్వ అధికారులు ఉత్తమ సేవలందిస్తే గుర్తింపు పొందుతారని, పోలీస్ అధికారులు సిబ్బంది రానున్న రోజుల్లో ప్రజలకు ఉత్తమ సేవలందించాలని సూచించారు. జిల్లా ప్రజలకు, ప్రభుత్వ అధికారులకు మీడియాకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజలకు చేరువగా సేవలు

- ప్రతీ సోమవారం ప్రజాదివస్
- ప్రజలతో ముఖాముఖి
- పేదలకు ఆర్థికసాయం
- దాదాపు ఐదేళ్లు పనితీరు
- బదిలీపై వెళ్లిన ఎస్పీ రాహుల్‌హెగ్డే



రిబ్బన్ కట్‌చేస్తున్న ఎస్పీ రాహుల్‌హెగ్డే (ఫైల్)



స్టడీమెటీరియల్స్ అందిస్తున్న ఎస్పీ (ఫైల్)

సిరిసిల్లక్రైం: ఒక అధికారి రెండేళ్లు పనిచేయడమే కష్టం అనుకుంటున్న నేటి తరుణంలో పోలీసుశాఖలో దాదాపు ఐదేళ్లపాటు జిల్లా పోలీసు బాస్‌గా విధుల నిర్వహించిన రాహుల్‌హెగ్డే తనదైన మార్క్ వేసుకున్నారు. 2018 మార్చి 12న విధుల్లో చేరి ఈనెల 26న హైదరాబాద్ ట్రాఫిక్ డీసీపీగా బదిలీపై వెళ్లారు. ఐదేళ్ల ప్రజలకు సత్వర సేవలందించేందుకు రాష్ట్రంలో ఎక్కడ లేనివిధంగా ప్రతీ సోమవారం ప్రజాదివస్ కార్యక్రమం నిర్వహించి ప్రజల సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీచేశారు. వీటిలో చాలావరకు సమస్యలు పరిష్కారమైనట్లు జిల్లాలో పేరుంది. ఏదైనా ఫిర్యాదు ఉండి స్టేషన్‌కు వెళ్లేందుకు భయపడే ఫిర్యాదుదారులను పోలీసులంటే ప్రజల కోసం పనిచేసే ఉద్యోగి అని బాధితులు నేరుగా ప్రజాదివస్‌కు నిర్భయంగా వచ్చి తమ సమస్యలు తెలపాలని బహిరంగ ప్రకటనలు జారీచేసిన అధికారిగా పేరు సంపాదించారు.

ప్రజలతో ముఖాముఖీ..

ప్రజలకు, పోలీసులకు సత్సంబంధాలు, జవాబుదారీతనంగా ఉండాలన్న నేపథ్యంలో జిల్లాలోని పోలీసు అధికారులందరినీ ఒకే వేదికగా ఏర్పాటు చేసిన బాధితుల సమస్యలను వారి ముందు తెలిపేందుకు ప్రజలతో ముఖాముఖీ కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్రంలో ఇలాంటి కార్యక్రమం నిర్వహించిన పోలీసు అధికారిగా పేరుగడించారు. ఖాకీ చొక్కా ఉద్యోగం అంటేనే కఠినంగా వ్యవరిస్తారన్న విధానాలను మార్చే పనులు చేసి పేదలకు బాసటగా నిలిచిన సందర్భాలు అనేకం ఉన్నాయి. రుద్రంగి మండలంలోని చిన్నారులు తల్లిదండ్రులను కోల్పోయిన నేపథ్యంలో వారికి ఇళ్లు నిర్మించి గృహప్రవేశం చేయించిన తీరు రాష్ట్ర పోలీసుశాఖ ఒకసారి జిల్లావైపు చూసేలా చేసింది.

నిరుద్యోగులకు ప్రత్యేక శిక్షణ శిబిరం..

జిల్లాలోని నిరుద్యోగ యువత ఉద్యోగాల వైపు అడుగులు వేయాలని వారికి పోలీసు కొలవుల కోసం దాదాపు 65 రోజులు ఉచిత శిక్షణ అందించేందుకు అన్ని ఏర్పాట్లుచేసి వారికి స్టడీమెటీరియల్స్, భోజన వసతి సదుపాయాలు కల్పించి ఉద్యోగార్థులకు చేరువయ్యారు. ప్రజలతో మమేకమయ్యేందుకు రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలను జిల్లా పోలీసుశాఖ పటిష్టంగా తీసుకుని క్రీడలను నిర్వహించారు. జిల్లాలోని పలు పోలీస్‌స్టేషన్లను జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్ కార్యాలయాన్ని మోడల్ పోలీస్‌స్టేషన్లుగా మార్చారు. అన్నిహంగులతో నిర్మించేలా పర్యవేక్షించారు. ప్రస్తుత కార్యాలయ భవనం ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉందన్న తరుణంలో ఐపీఎస్‌ల బదిలీల్లో భాగంగా ఎస్పీ రాహుల్‌హెగ్డే హైదరాబాద్‌లోని ట్రాఫిక్ విభాగానికి డీసీపీగా బదిలీపై వెళ్లారు. జిల్లా పోలీస్ కార్యాలయ భవనం ప్రారంభం జరిగితే తాను చాలా సంతోషంగా ఉండేవాడినని తన అభిప్రాయాన్ని వ్యక్తంచేశారు. శుక్రవారం రాహుల్‌హెగ్డే పుట్టినరోజు సందర్భంగా శుభాకాంక్షలు తెలిపిన పలువురు అధికారులు, అదేక్రమంలో నూతన ఎస్పీగా విధుల్లో చేరిన అఖిల్‌మహాజన్‌ను మర్యాదపూర్వకంగా కలవడంతో జిల్లా కేంద్రంలో పండుగ వాతావరణం కనిపించింది.

జమున మృతి తీరని లోటు

జగిత్యాల: సినీనటి జమున మృతి తీరని లోటు అని మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు విజయలక్ష్మి పేర్కొన్నారు. ఏపీలోని రాజమండ్రి నుంచి ఆమె కాంగ్రెస్ పార్టీ లోక్‌సభ ఎంపీగా గెలిచారన్నారు. జమునకు కాంగ్రెస్ పార్టీతో విడదీయలేని అనుబంధం ఉందన్నారు.

మైతాపూర్‌లో వ్యక్తి ఆత్మహత్య

రాయికల్: మండలంలోని మైతాపూర్‌కు చెందిన మర్రిపల్లి బాజయ్య (53) జీవితంపై విరక్తి చెంది ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై కిరణ్‌కుమార్ శుక్రవారం తెలిపారు. బాజయ్య కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నాడని జీవితంపై విరక్తి చెంది గ్రామశివారులోని ఓ మామిడితోటలో లుంగీతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. మృతుడి తల్లి చిన్నక్క ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. మృతుడికి ఒక కుమారుడు ఉన్నాడు.

ఉరేసుకుని వృద్ధురాలు...

జగిత్యాలక్రైం: జిల్లాకేంద్రంలోని పోచమ్మవాడకు చెందిన దయ్యాల బుచ్చమ్మ (80) వృద్ధురాలు గురువారం రాత్రి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. పోచమ్మవాడకు చెందిన బుచ్చమ్మ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. కుటుంబ సభ్యులు పలు ఆస్పత్రుల్లో చూపించినా ఆరోగ్యం నయం కాకపోవడంతో మనస్తాపానికి గురైన బుచ్చమ్మ గురువారం రాత్రి తన ఇంట్లోని సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి కుమార్తె చెట్టి రాజు ఫిర్యాదుతో కేసు నమోదుచేసినట్లు పట్టణ సీఐ కిశోర్ తెలిపారు.

గవర్నర్‌కు క్షమాపణ చెప్పాలి



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

పెగడపల్లి: రాష్ట్ర గవర్నర్ తమిళిసైపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి క్షమాపణ చెప్పాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి మర్రిపల్లి సత్యం డిమాండ్ చేశారు. పెగడపల్లిలో పార్టీ నాయకులతో కలిసి మాట్లాడారు. కౌశిక్‌రెడ్డిని వెంటనే ఎమ్మెల్సీ పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. మహిళా మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అనసూర్య, బీజేపీ మండల అధ్యక్షుడు కొమురెల్లి, నాయకులు కిశోర్, మహేశ్ పాల్గొన్నారు.

'శ్రావణి ఆరోపణలు అవాస్తవం'



మాట్లాడుతున్న మోర హన్మండ్లు

జగిత్యాల: ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌పై మున్సిపల్ చైర్‌పర్సన్ భోగ శ్రావణి చేసిన ఆరోపణలు అవాస్తవమని రాయికల్ మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లు అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జగిత్యాల నియోజకవర్గంలోని జగిత్యాల, రాయికల్ మున్సిపాలిటీల్లో అతిపెద్ద సామాజికవర్గంగా ఉన్న పద్మశాలిలకు పదవులిచ్చి తమ సామాజిక వర్గంపై ప్రేమను ఎమ్మెల్యే చాటుకున్నారని అన్నారు. రాయికల్ మున్సిపల్ చైర్మన్‌గా 10 రోజుల ముందే తన పేరు ప్రకటించి గెలిపించుకున్నారని గుర్తు చేశారు. అంతటి ఎమ్మెల్యే దొరతనం ప్రదర్శిస్తున్నాడని, చిన్నచూపు చూస్తున్నారని మాట్లాడటం సమంజసం కాదన్నారు. రాయికల్ మున్సిపల్ కౌన్సిలర్లు కాంతం, సత్యనారాయణ, లతిక, అనిల్ సాయికుమార్, మహేందర్‌బాబు, శ్రీధర్ పాల్గొన్నారు.

విద్యుత్‌షాక్‌తో వ్యాపారి మృతి



గంగాధర్ (ఫైల్)

వేములవాడ అర్బన్:పట్టణానికి చెందిన వస్త్రవ్యాపారి ఆడెపు గంగాధర్(45) ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్‌కు గురై శుక్రవారం మృతిచెందాడు. తన షాపు లోని బోర్డును మార్చే క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుత్‌తీగలు తగిలి అక్కడికక్కడే కుప్పకూలాడు. హుటాహుటిన స్థానికంగా ఉన్న ఓప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు బంధువులు తెలిపారు. మృతుడు 20ఏళ్లుగా వస్త్ర వ్యాపారం చేస్తున్నాడు. గంగాధర్ మృతి పై వ్యాపారులు వేముల శ్రీనివాస్, కొమ్ము నటరాజ్, వేముల విష్ణు, వెంకటేశ్వర్లు, శ్రీకాంత్ సంతాపం తెలిపా రు. మృతునికి భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి..



గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

మల్యాల: మండలంలోని ముత్యంపేట కొండగట్టులో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందినట్లు ఎస్సై మంద చిరంజీవి తెలిపారు. కొండగట్టు వద్ద గుర్తు తెలియని వ్యక్తిని టాటా ఏస్ వాహనం ఢీకొన్న ఘటనలో అక్కడిక్కడే మృతిచెందాడు. మృతుడి వయసు సుమారు 40–45 ఏళ్ల ఉంటాయని, ఎవరైనా గుర్తుపడితే మల్యాల ఎస్సై చిరంజీవి 94407 95284, , మల్యాల సీఐ రమణమూర్తి 9440619333 నంబర్లకు సమాచారం ఇవ్వాలని ఎస్సై తెలిపారు.

సమాచారమడిగితే చంపుతారా..?

- ఆర్టీఐ అడిగిన వ్యక్తికి అధికార పార్టీ నాయకుడి బెదిరింపులు
- కాంగ్రెస్ నాయకుల ఖండన
- పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు



పార్టీ ఆఫీస్‌లో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

కోనరావుపేట: పంచాయతీలో జరిగిన అవినీతి జరిగిన అక్రమాలపై ప్రశ్నించిన వ్యక్తిని చంపుతామని బెదిరించడం సరికాదని కాంగ్రెస్ మండల కమిటీ ఖండించింది. శుక్రవారం కోనరావుపేట పార్టీ కార్యాలయంలో సమావేశం నిర్వహించి మండలాధ్యక్షుడు షేక్ ఫిరోజ్‌పాషా మాట్లాడారు. కొండాపూర్ జీపీ కార్యాలయంలో రూ. 25లక్షల అవినీతిపై రత్నాకర్ ఆర్టీఐ ద్వారా రికార్డులను పరిశీలించగా గుర్తించారన్నారు. దీంతో సర్పంచ్, కార్యదర్శి చెక్‌పవర్‌ను ఎంపీవోకు అటాచ్ చేస్తూ జిల్లా అధికారులు ఉత్తర్వులు జారీచేశారన్నారు. ఈక్రమంలో ఆగ్రహానికి గురైన సర్పంచ్ దేవయ్య రత్నాకర్‌ను గ్రామపంచాయతీ వద్దకు పిలిపించి బెదిరింపులకు గురిచేయడం సరికాదన్నారు. ఈ విషయమై కోనరావుపేట పోలీస్‌స్టేషన్‌లో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు, సర్పంచ్ మల్యాల దేవయ్యపై ఫిర్యాదు చేశామన్నారు. కార్యక్రమంలో డీసీసీ నాయకులు కచ్చకాయల ఎల్లయ్య, చందనగిరి గోపాల్, కేతిరెడ్డి లక్ష్మారెడ్డి, పెంతల శ్రీనివాస్, సదానందం, దర్ర రవి, లింభయ్య తదితరులు ఉన్నారు.